ట్రాఫిక్ కష్టాలు

- సీతమ్మధార రైతుబజార్ ఎదుట రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- కొనుగోలుదారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



రైతుబజార్ రోడ్డులో బారులు తీరిన ద్విచక్ర వాహనాలు



తోపుడుబండ్ల ఎదురుగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు



రైతుబజార్ రోడ్డు మీదనే ఆటోలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్

సీతమ్మధార : నగరంలోనే పెద్ద రైతుబజార్లలో సీతమ్మధార ఒకటి. కానీ ఇక్కడ వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కి మాత్రం మోక్షం కలగడం లేదు. ఇతర బజార్లలో పార్కింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు ట్రాఫిక్ కష్టాలు తప్పుతున్నాయి. ఇక్కడ మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. రోడ్డు మీదే వాహనాల పార్కింగ్ కారణంగా ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. ఇక్కడ 1999లో రైతుబజార్ నిర్మించారు. రోజూ ఉదయం 160 మంది రైతులు, సాయంత్రం 80 మంది కూరగాయలు విక్రయిస్తారు. ఈ బజార్‌కి సీతమ్మధార, కేఆర్ఎం కాలనీ, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, మద్దిలపాలెం, భానునగర్, హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, పాత వెంకోజీపాలెం, పాత, కొత్త రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గురుద్వారా, శాంతినగర్, సీతంపేట తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది కొనుగోలుదారులు వస్తుంటారు.

బజారు చుట్టూ ట్రాఫిక్ అస్తవ్యస్తం

సీతమ్మధార రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో బజారుకి రెండు వైపులా రోడ్డు మీదనే నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. బజారు బయట ఒకవైపు తోపుడు బండ్లు, మరోవైపు వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్ అవుతున్నా ఇక్కడ ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం కానరాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తోపుడు బండ్లు ఎదురుగానే కూరగాయలు తెచ్చే ఆటోలు కూడా నిలిపేస్తుండడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. ముఖ్యంగా పండగల సమయంలో నడిచి వెళ్లడం కూడా కష్టమే అన్న పరిస్థితి నెలకొంటోంది. ఈ మార్గంలో 69వ నంబర్ సిటీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఇంకా ఇతర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దుకాణాలు, వాహనాల పార్కింగ్ కారణంగా బజారు రోడ్డులోనే గల ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్ వసతిగృహానికి సిబ్బంది, ఉద్యోగులు రాకపోకలు సాగించడానికి కూడా తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. బజారు లోపలికి వెళ్లేందుకు రెండు ప్రవేశ ద్వారాలకు అడ్డంగా నేల దుకాణాలు, వాహనాల పార్కింగ్ ఆటంకంగా మారడంతో వినియోగదారులు బజారు లోపలికి, బయటకి రావడానికి కూడా అవస్థలు పడాల్సి వస్తోందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బజారు తనిఖీ నిమిత్తం వచ్చే జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారుల వాహనాల పార్కింగ్‌కూ స్థలం లేకపోవడంతో ఎక్కడో దూరంగా నిలిపి నడుచుకుని రావాల్సి వస్తోంది. రైతుబజార్ సిబ్బంది, వ్యాపారులకు కూడా వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది

వినియోగించని తోపుడుబండ్లతో అవస్థలు

రైతుబజారు బయట అధిక సంఖ్యలో తోపుడు బండ్ల ద్వారా పండ్లు, కూరగాయల వ్యాపారాలు సాగుతున్నాయి. అయితే పలు తోపుడుబండ్లు వినియోగంలో లేకున్నా జోన్ - 3 టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదు. తోపుడు బండ్ల వద్దనే వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. వాహనాల రద్దీతో ఈ ప్రాంతంలో హారన్ల మోత కారణంగా స్థానిక నివాసులు, పాదచారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలని, అప్పటి వరకూ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

పార్కింగ్ క్రమబద్ధీకరించాలి

సీతమ్మధార రైతుబజార్ వద్ద పార్కింగ్ ప్రదేశం లేక వినియోగదారులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. బజారు బయట వినియోగించని తోపుడు బండ్లను వెంటనే టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు తొలగించాలి. ప్రభుత్వం స్పందించి బజారు సమీపంలో పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలి.
– **ఈశ్వరరావు**, సీతమ్మధార

హోమ్‌గార్డును నియమించాలి

సీతమ్మధార రైతుబజార్ ఎదుట నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే 69వ నంబరు సిటీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులూ ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఎంవీపీ ట్రాఫిక్ స్టేషన్ నుంచి హోమ్‌గార్డుని అయినా నియమించాలి.
– **పద్మావతి**, బాలయ్యశాస్త్రి లే అవుట్

పార్కింగ్ స్థలం కేటాయించాలి

సీతమ్మధార రైతుబజార్ వద్ద వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉంటోంది. మిగిలిన బజార్లలో పార్కింగ్ ప్రదేశం ఉంది. ఇక్కడ మాత్రం రోడ్డు మీదనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. ఫలితంగా రోజూ ఈ మార్గంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇప్పటికైనా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– **లత**, నక్కవానిపాలెం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మద్దిపాలెం : ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ - 2 పరిధి 11 కేవీ మాధవధార - 1 ఫీడర్, ఎస్ఎస్‌టీవీఎల్ సెక్షన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మాధవధార ఉడా కాలనీ, ఈస్ట్ పార్క్ ప్రాంతం, మాధవస్వామి ఆలయం రోడ్, గడప్ప ఎన్‌క్లేవ్ ప్రాంతం, కళింగనగర్, అంబేద్కర్ నగర్, సాయి నగర్, జాకీర్ హుస్సేన్ నగర్, పార్వతీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

అక్కయ్యపాలెంలో మెగా ఫాగింగ్

సీతంపేట : దోమల నియంత్రణకు జీవీఎంసీ 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం జీవీఎంసీ సిబ్బంది మెగా ఫాగింగ్ నిర్వహించారు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్, నారాయణ స్కూల్, జీవీఎంసీ స్కూల్స్, ఆరోగ్య కేంద్రం, భారత్ గ్యాస్, పద్మశ్రీ ఆస్పత్రి, కమల్ ఆర్కేడ్, కట్టా ఎన్‌క్లేవ్, రమ్య అపార్ట్‌మెంట్, ఎన్జీజీవోస్ కాలనీ, హైవే రోడ్ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలని, తద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్‌వైజర్ కె.శివ సత్యనారాయణ, ఆపరేటర్ రాంబాబు అవగాహన కల్పించారు.

పాత కేసులో నిందితుడి అరెస్ట్

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తప్పించుకు తిరుగుతున్న పాత నిందితుడిని రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గోల్లోరి కేశవరావు గంజాయి తరలించేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఇతను పాత కేసులో తప్పించుకు తిరుగుతున్నాడని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు తెలిపారు.

క్లుప్తంగా

అన్నిదానాల్లో అన్నదానం మిన్న



భక్తులకు అన్నదానం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణీ దుర్గా అమ్మవారి ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప మాలధారులకు అన్నసమారాధన చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో క్రాంతి పిక్చర్స్ అధినేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ సీఈవో శ్రీధర్‌రెడ్డి అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో మాలధారులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్ని దానాల్లోనూ అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. ఈ సందర్భంగా 600 మంది అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. కర్రి వెంకటకృష్ణారెడ్డి, మహేశ్వరి దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ అటవీ శాఖ మాజీ డైరెక్టర్ గుజ్జి వెంకటరెడ్డి, గాయత్రి ఫైనాన్స్ ప్రతినిధి కర్రి సూర్యనారాయణరెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఒడిశా యువకుడి అదృశ్యం



అక్షయ్‌కుమార్

తాటిచెట్లపాలెం : ఒడిశాకు చెందిన యువకుడు తప్పిపోయినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 14న రాత్రి హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్లే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన అక్షయ్‌కుమార్ బిస్వాల్ బయల్దేరాడు. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా రైలు దువ్వాడ - విశాఖపట్నం మధ్య ప్రయాణించే సమయంలో తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. జీఆర్పీ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని తరలిస్తున్న సంస్థ సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ రాంబాబు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలో భిక్షాటన చేసుకునే మహిళ గురువారం మరణించడంతో స్థానిక అవర్ హేండ్స్ సంస్థ ప్రతినిధి పిల్లి గోవిందరాజు ఐదో పట్టణ పోలీసుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక నాయకులు ఐతి రవి, ఐతి మధు సహకారంతో మృతదేహాన్ని అంతిమ యాత్ర వాహనంలో కాన్వెంటు కూడలిలో గల శ్మశన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, సంస్థ ప్రతినిధులు నరసింహ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనక మహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కఠోర శ్రమతో లక్ష్య సాధన



సీతారామస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రంథాలయ ప్రతినిధులు

సీతంపేట : కఠోర శ్రమ, లక్ష్య సాధన, వృత్తి పట్ల అంకిత భావం ఉంటే ఉన్నతంగా రాణించవచ్చని మాగ్నా ఇంటర్నేషనల్ (అమెరికా) సీఈవో కోటగిరి సీతారామస్వామి అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. వారి కోసం గ్రంథాలయంలో కల్పించిన సౌకర్యాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతారామస్వామి మాట్లాడుతూ తాను అశ్వారావుపేటలో జన్మించానని, కర్ణాటకలో బిట్స్ పిలానీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడినై అమెరికాలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ఉన్నత చదువులు చదివానని తెలిపారు. కష్టపడి సంపాదించుకోవడానికి ఎవరూ సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని స్వయంకృషితో ఎదిగానన్నారు. జనరల్ మోటార్స్‌లో ఉన్నత పదవిలో పనిచేసి లక్ష మందికి పైగా ఉద్యోగులతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీ సీఈవో స్థాయికి ఎదిగానన్నారు. లక్ష్య సాధన, కఠోర శ్రమ, అంకిత భావం ఉన్నత స్థాయికి చేర్చాయన్నారు. ఆత్మవిశ్వాసం ఉంటే లక్ష్య సాధనలో విజయం సొంతం అవుతుందని, ఫలితం ఆశించకుండా పని చేయాలని సూచించారు. గ్రంథాలయంలోని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, ఉపాధ్యక్షుడు టి.ఎస్.ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్రం విధానాలు ఐక్యంగా తిప్పికొట్టాలి



అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్‌కోరారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి మూడోసారి ప్రధానమంత్రి అయిన మోడీ హయాంలో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. కార్మికులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం చేస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడి సరుకు సరఫరా చేయకుండా ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆటో, భవన నిర్మాణ కార్మికులు, వీధి విక్రయదారులు, రవాణా రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 26న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ ఆఫీస్ దరి గాంధీ పార్కు వరకు నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధురెడ్డి, రావి అశోక్, శ్రీను, శివ, సతీష్, స్వామి పాల్గొన్నారు

ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి

- అఖిలభారత మత్స్య కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు జేవీఎస్

అల్లిపురం : ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని అఖిల భారత మత్స్య కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం అల్లిపురం మహాత్మాగాంధీ మార్కెట్ వద్ద ఆయన పతాకం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో మత్స్య సంపద కూడా వ్యవసాయ రంగంతో ముడిపడి ఉందన్నారు. అందులో భాగంగా దేశానికి, రాష్ట్రానికి మత్స్య సంపద వల్ల సంపద చేకూరుతుందన్నారు. దురదృష్టవశాత్తు దేశ పాలకుల విధానాల వల్ల వేటకు వెళ్లి మత్స్యకారులు అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఏపీ రాష్ట్ర మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లనయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతం, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెయ్యల నాగభూషణం, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.పోతయ్య, గరికిన లక్ష్మణరావు, కూడా వజ్రం, చీకటి గురుమూర్తి, పల్లేటి పార్వతి, కె.పార్వతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పతాకం ఆవిష్కరిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి, తదితరులు

మొక్కల సంరక్షణకు చర్యలు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ పార్కులో మొక్కల సంరక్షణకు గురువారం చర్యలు చేపట్టారు. ఎదిగిన మొక్కలను వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సరిచేసి బ్యూటిఫికేషన్ చేయడంలో భాగంగా ప్రూనింగ్ చేశారు. క్రోటన్స్ మొక్కలను అందంగా తీర్చిదిద్దారు. ఇతర మొక్కల కొమ్మలు తొలగించి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు శ్రమదానం చేసి చెత్త తొలగించారు.

నవజాత శిశువుల మరణాలు తగ్గించేందుకు చర్యలు



మాట్లాడుతున్న కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధాకృష్ణ

మహారాణిపేట: నవజాత శిశువుల మరణాలు తగ్గించేందుకు అన్ని చర్యలు చేపట్టామని కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణ తెలిపారు. కేజీహెచ్ పిల్లల వార్డులో జాతీయ నవజాత శిశువుల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్టాఫ్ నర్సులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేజీహెచ్‌లో నవజాత శిశువులకు వైద్య సేవలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ నవజాత శిశువులకు వైద్యసేవలు చాలా బాగా అందుతున్నాయని చెప్పారు. వైద్యులు, నర్సులు, అనుబంధ ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయడం వల్ల సాధ్యపడిందన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి మాట్లాడుతూ నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం నుంచి కృషి జరుగుతోందన్నారు. స్టాఫ్ నర్సులకు, శిక్షణ విద్యార్థులకు వ్యాసరచన, గ్రూప్ చర్యలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లల వైద్యురాలు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ చౌదరిబాబు పాల్గొన్నారు.

23న సంగీత విభావరి

దాబాగార్డెన్స్ : అందాల నటుడు కమల్ హాసన్ నటించిన చిత్ర గీతాలతో ఈ నెల 23న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఆకాశమే నీ హద్దురా' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు గీత్ – సంగీత్ సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంస్థ కార్యాలయంలో సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ మనోహర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆ రోజు సాయంత్రం నిర్వహించనున్న సంగీత విభావరికి సంగీత ప్రియులు హాజరు కావాలని కోరారు.

చురుగ్గా పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు



పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం తొలగించిన చెట్లు

సీతమ్మధార : సీతమ్మధార ప్రాంతంలో రెండో పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పౌర సరఫరాల సంస్థ ఇప్పటికే సీతమ్మధార ప్రెస్‌క్లబ్ పక్కన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నిర్వహిస్తోంది. ఇప్పుడు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి బస్టాప్ సమీపంలో గల ఫుట్‌పాత్ మీద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇప్పటికే ఏర్పాటు చేశారు. బంక్ ఏర్పాటు చేయనున్న స్థలంలో ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించారు. కొద్ది రోజులుగా చెట్లు తొలగించి నేల చదును పనులు చేస్తున్నారు. ఇక్కడ రెండో పెట్రోల్‌బంక్ వస్తే వాహన చోదకులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని, ప్రభుత్వమే స్వయంగా నిర్వహిస్తే కొలత విషయంలో కూడా కచ్చితత్వం ఉంటుందని, కల్తీకి ఆస్కారమే ఉండదని నగరవాసులు భావిస్తున్నారు. త్వరలోనే బంక్ అందుబాటులోకి వస్తుందని సమాచారం.

సమగ్ర సంక్షేమ చట్టం చేయాలి



ర్యాలీలో గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతంపేట : చిల్లర వర్తకులు, ఆటో డ్రైవర్ల కోసం ప్రభుత్వం సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కేలం శివ, రావికృష్ణ కోరారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను గురువారం నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది చిల్లర వర్తకులు, ఆటో డ్రైవర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయల పన్నులు చెల్లిస్తున్నా వారిని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. చిల్లర వర్తకులకు హాకర్ జోన్స్ ఏర్పాటు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి అసంఘటిత రంగ కార్మికులపై ఖర్చుల భారం తగ్గించాలని కోరారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ మహా ప్రదర్శనలో ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకులు భారీగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వి.శ్రీనివాస్, పి.సూర్యారావు, సాయికుమార్, లక్ష్మణరావు, గణేష్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుల గణనతోనే సామాజిక న్యాయం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేవీ ప్రభాకర్, తదితరులు

సీతంపేట : దేశంలో కుల గణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్‌లో గల అంబేద్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కులగణన – సామాజిక న్యాయం అంశంపై అంబేద్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కుల గణన అంటే కేవలం సంఖ్యాపరమైన లెక్కలు మాత్రమే కాదని, ఆయా సామాజిక వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన అంశాలన్నీ అందులో ఉంటాయన్నారు. దీని ద్వారా స్వాతంత్ర్యం వచ్చాక ఆయా సామాజిక వర్గాల్లో ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో స్పష్టత లభిస్తుందన్నారు. పలువురు ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

చోరీల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ లతామాధురి

సీతమ్మధార : చోరీల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నగర క్రైం డీసీపీ లతా మాధురి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె గురువారం మధ్యాహ్నం ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. స్టేషన్ పరిధిలో చోరీలు, చైన్‌స్నాచింగ్, బైక్‌ల చోరీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయడం ద్వారా చోరీలను సమర్థంగా అరికట్టవచ్చన్నారు. సీసీ కెమెరాల నిర్వహణను మెరుగుపరచాలన్నారు. కొత్త ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చోరీ కేసుల్లో రికవరీ శాతం గణనీయంగా పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. చోరీలు జరిగే ప్రాంతాలను గుర్తించి, గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. క్రైం ఏడీసీపీ మోహనరావు, సీఐ బంగారు పాపే, ద్వారకా క్రైం ఎస్ఐ రాజు, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.